


# ఆనాటి అపురూప చిత్రాలు

## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి  సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి–అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.

హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్  వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు  ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో  పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)

అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు  పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల  గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.

# పాతాళభైరవి – 3

.

రాకుమారి వచ్చేవేళకి తోటనీ, గుడిసెనీ పూలతో అలంకరించి, తన గుడిసె ప్రవేశద్వారం వరకూ పూలు చల్లుతాడు రాముడు.

అంజితో: నిజంగా చెప్పరా. ఈ పూలపందిరితో ఈ తోటకంతా అందం రాలా?

అంజి: అంతేకదయ్యా. మనసు కలగంటే తోటంతా కలకల్లాడుతుంది. –లోనికిపోయి—ఓహోహోహో– – పోయి తూగుటూయలపై కూర్చోబోతాడు.

రాము: అక్కడ రాకుమారి కూర్చోవాలిరా.

అంజి:పోనీ ఇలా కూర్చుంటాలేవయ్యా.

రాము: ఆఁఆఁఆఁ... అక్కడ మనం కూర్చోవాలిరా.

అంజి: ఆఁ. అంటే?

రాము: అంటే... మనం రాకుమారిని పెళ్ళిచేసుకుంటున్నామురా.

అంజి: అంటే?

రాము: అంటే...మనం ప్రేమించడం, అంగీకరించడం ఐపోయింది.

అంజి: అంటే?

రాము: ఇక రాకుమారిదే భారం. అంటే...

అంజి: అహోహోహో—గలగలా నవ్వుతాడు.

రాము: ఏహేహేహే.

సఖి: రాజకుమారి వస్తోందిగాని ఎక్కడైనా ఊరేగండి.

అంజి: రామిత్రమా.

రాము: ఛస్తే ఇక్కడనుండి కదలను.

అంజి: నేను ఛస్తే ఇక్కడొక క్షణం ఆగను. – చెలికత్తెని వెనక ద్వారం లోంచి తనతో తీసుకుపోతాడు.—రాము ఊయల సర్దుతూవుండగా

రా.కు.ఇందుమతి తోటలో ప్రవేశం. క్రింద పూలతివాసీ, పూలపందిరి అలంకరణలు చూస్తూ గుడిసెలో ప్రవేశిస్తుంది. ఊయలలో గుండెలపై చేతులు వేసుకుని రాముడు నిద్ర నటిస్తాడు. ఆమె ఊయల వద్దకివచ్చి రాముడిని పరీక్షగాచూసి అటూఇటూ దొంగచూపులు చూసి నెమ్మదిగా ఊయల ఊపుతుంది. (గుడిసె వెనక మౌనంగా అంజి,నళిని సరసాలు) –లోపల—

రాము: ఆహా.రాకుమారీ.(ఇందు సంభ్రమంతో ఒక అడుగు వెనక్కివేసి వింటూ వుంటుంది.) నీకోసం ఎంత తపించిపోతున్నానో నీకెలా తెలుస్తుంది? నా ప్రేమసందేశం నీకెలా పంపుకునేది? నీవు విహారానికి రాగానే పరిమళించమని పువ్వులనడిగాను. నా తరపున వీచమని మలయపవనాన్ని అడిగాను. నా అనురాగాన్ని పాటగా పాడమని కోయిలని బ్రతిమాలుకున్నాను. నీ సోయగానికి జోహారు చేశాను.

ఇందు: నళినీ...

నళిని వచ్చి: ఏమ్మా?

ఇందు: ఎవరే ఈ పురుషుడు?

నళి: ఏమోనమ్మా. ఎప్పుడూ చూడలేదే?

ఇందు: నోరుమూసుకుని అవతలకి పంపించు. –నళిని కొంటెగా ఒక కుండ తీసుకుని రాముడిని మొత్తబోతుంది.

ఇందు–గాభరాగా—నళినీ...

నళి: ఓహో విసరాలికదూ?—పూలగుత్తి వాసన చూపించి తట్టి లేపుతుంది. రాముడులేచి కళ్ళు నులుముకుంటూ: ఏమిటిది? ఎక్కడున్నాను?

నళి: ఆకాశంలో ఉన్నావుగాని అవతలకి నడువు.

రాము——అప్పుడే చూసినట్లుగా: రాకుమారీ.దయచేయండి. దయచేయండి.

ఇందు: ఏమిటీ ప్రేలాపన? ఇక్కడెందుకున్నావ్?

రాము:––చేతులుకట్టుకుని నవ్వుతూ: నిజం చెప్పమన్నారా? అబద్ధం చెప్పమన్నారా?

ఇందు: నీకొంటెతనం నాదగ్గరకాదు. నిజమేచెప్పు.

రాముడు ఒక పూలచెండు తీసి వాసన చూసి : ఈ పుష్పం తోటకంతా పరిమళం తెస్తుంది. మీకు కానుకగా ఇచ్చుకుందామని...

ఇందు: పువ్వుతీసి ఊయలలోకి విసరి :ఏమిటీ?భయం లేకుండా? నీవు,నీ సాహసము? –నేపథ్యంలో –ఒరే రామూ——చేతిలో కఱ్ఱతో అతడి తల్లి ప్రవేశం. :సుపుత్రా కొంపపీకరా అని——ఏం చేస్తున్నవురా ఇక్కడ?

రాము: ఏం లేదమ్మా.——వంగి వీపు చూపుతాడు.

తల్లి: ఓరి భగవంతుడా. ఒక కొడుకునిమ్మంటె ,ఈ రాక్షసుణ్ణి ఇచ్చావేమిరా? (రా.కు. సఖి నవ్వుతారు) రాముడు లేచి నిలబడి బుఱ్ఱగోక్కుంటుంటే, తల్లి రాముడిని పట్టుకుని : ఏం చేసినా ఒక్కసారి కాపాడమ్మా. ఒక్కగానొక్క కొడుకు. ఎప్పుడొస్తుందిరా నీకు బుద్ధి? –

ద్వారం బయటనుండి అంజి: పెళ్ళిచెయ్యిపిన్నీ. వెంటనే వస్తుంది.

––సఖి నళిని: ఇంకొకసారి ఇలాగే చెస్తే నిజంగానె పెళ్ళవుతుంది. పదండి. పదండి.——తల్లితోపాటు వెళుతూ రాకుమారిని చూస్తూ బయటికిపోతాడు రాముడు. అందరూ నిష్క్రమించగానే ఊయలలో పడివున్న పూవుని చిరునవ్వుతో ఆప్యాయంగా తీసుకుంటుంది రాకుమారి.

★★★

పాట

ఇందు: ఎంత ఘాటు ప్రేమయో ఎంత తీవ్ర వీక్షణమో
ఎంత ఘాటు ప్రేమయో
కన్నుచాటు చిన్నదిగ కలలు విరిసెనే
నా మనసు మురిసెనే నా మనసు మురిసెనే
ఎంత ఘాటు ప్రేమయో

రాము: ఎంత లేత వలపులో ఎంత చాటు మోహములో ఓ
ఎంత లేత వలపులో
కన్నులలో కనినంతనే తెలిసిపోయెనే
నా మనసు నిలిచెనే నా మనసు నిలిచెనే
ఎంత లేత వలపులో

ఇందు: ఈ జాబిలి ఈ వెన్నెల ఈ మలయానిలము
ఈ జాబిలి ఈ వెన్నెల ఈ మలయానిలము
విరహములో వివరాలను విప్పిచెప్పెనే
ఎంత---

రాము: ఓ జాబిలి ఓ వెన్నెల ఓ మలయానిలమా
ఓ జాబిలి ఓ వెన్నెల ఓ మలయానిలమా

ప్రియురాలికి విరహాగ్నిని పెంపుచేయరే
ఎంత లేత వలపులో ఎంత చాటు మోహములో ఓ
ఎంత లేత వలపులో...

======================

రాణిగారి తమ్ముడు,రాణి రాజుగారివద్దకు ప్రవేశం.

రాజు:అహ్హాహ్హా... రాణీ,నీ తమ్ముడు పెళ్ళికూతురౌతున్నాడెమిటి?

రాణిగారి తమ్ముడు: పెళ్ళికూతురేవిఁటి? తప్పుతప్పు. పెళ్ళికొడుకను బావా.

రాణి: ఇవాళ మనం తాంబూలాలు పుచ్చుకుంటున్నాం. నేను మా తమ్ముడివైపు. మీరు మీ కూతురివైపు.

రాజు: అలా ఆ మాటంటూవుంటే ఎంతముద్దొస్తున్నావు రాణీ?

రాణి: మరి నాముద్దు చెల్లించండి.

రాజు: ఎప్పటిదోయ్?

రాణి: అబ్బపొండి. మన అమ్మాయిని మాతమ్ముడికిచ్చి చేసుకోవచ్చుగా? -- రాణిగారి తమ్ముడు ఆ ఇద్దరిమధ్యకి వచ్చి నిలబడతాడు వెర్రిమొహం వేసుకుని.

రాజు: దానికేం? అమ్మాయినికూడా రానీ. దాన్నికూడా కనుక్కుందాం.

రాణిగారి తమ్ముడు: దాన్ని కనుక్కునేదేమిటి? తప్పుతప్పు. ఎద్దునడిగి గంతలు కడతారేఁవిటి?

రాజు: రాణీ. ఇక్కడో బెత్తం ఉంచుతూవుండు. తప్పన్నప్పుడల్లా మీ తమ్ముడికొక చురక వేస్తుంటాను. —రా.కు.ప్రవేశం :చురకెవరికి నాన్నోయ్? —తండ్రిపక్కకి వస్తుంది.

రాజు: ఇందూ. నీవు చురుకైనదానివిగాని చప్పునచెప్పు. మీ అమ్మ నిన్ను మీ మామయ్యకిచ్చి చేసుకుంటుందిట. ఏమంటావు?

రాణి: అంత మొరటుగా చెప్తే అది గారం చేస్తుంది.

ఇందు: గారమెందుకు చేస్తానే అమ్మా? నా స్వయంవరం మామయ్యతోనే మొదలనుకుంటాను.

రాణిగారి తమ్ముడు: ఇహ్హిహ్హి. అక్కయ్యా. ఇందూ ఒప్పేసుకుంది. చూశావా నన్ను స్వయంవరం చేస్తుందిట! —రాజు నవ్వుతాడు.

★★★

(సశేషం)

COMMENTS